AIJRELPLS VOLUME 7, ISSUE 4 (2022, JUL/AUG) (ISSN-2456-3897)ONLINE
Anveshana's International Journal Of Research In Education, Literature, Psychology And Library Sciences

# పండుగ సాయన్న కథాగానం - ఒక పరిశీలన

**యం.రవి కుమార్**
పరిశోధక విద్యార్థి,
జానపద కళల శాఖ,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైదరాబాద్
gudipallyravikumar@gmail.com

పండుగ సాయన్న కథ "దాదాపు 70 సంవత్సరాల క్రితం జరిగిన చారిత్రక కథ. మహబూబ్‌నగర్ జిల్లా మెరుగోని పల్లెలో సాయన్న పుట్టాడు. తల్లి సాయమ్మ - తండ్రి హనుమయ్య. ఇంటిపేరు పండుగ. కులానికి తెలగ. బిడ్డలు లేని సాయమ్మ పీర్లకు మొక్కితే ఏడుగురు ఆడపిల్లలు ముగ్గురు మగపిల్లలు పుట్టారు. సాయన్న ` చిన్న సాయన్న` అంతయ్య మొగపిల్లల పేర్లు. సాయన్న తమ్ముడు అంతయ్య మనుమలు ఇద్దరూ ఇప్పటికీ కేశరావుని పల్లే (షాద్‌నగర్ నుంచి నవాబుపాలెం వెళ్లేదారిలో కొల్లూరుకు రెండుమైళ్ళ దూరంలో ఉంది. సాయన్న నివాసం ఉండిన ఇల్లూ - వాకిలీ ఇక్కడున్నాయి)లో ఉన్నారు. సాయన్న భార్య బాలమ్మ. పేద వ్యవసాయదారుల కుటుంబంలో పుట్టిన సాయన్నకి చదువుకొనే అవకాశం కలగలేదు. లంబాడీ చిన్న చౌడన్నతో 'సోపతి' చేశాడు. సాముగరిడీలు నేర్చాడు. 'ఒకటి నేర్పేటాళ్లకు రెండు నేర్చిండు'. మీసాలు పురిపెట్టి చెవులకు ఒడిచుట్టేవాడు. నడుము పిడికెడు, మూడు జానల ఎద సాయన్నకి. సాయన్నకి ఆరుమంది దోస్తీలు. కందూరులు (మొక్కుబళ్ళు`బలులు) చేయడానికి బియ్యంకోసం సాయన్న దోస్తీలతో కలిసి దోపిడీ మొదలెట్టాడు. తాండూరికి పోతున్న 12 బియ్యం బళ్ళని 'మైసమ్మ గుడికాడ' కాపేసి దోచాడు. కందూరులు చేయడానికి కావాల్సిన 'యాట'లు కూడా గొల్ల చెన్నయ్య మంద నుంచి కొట్టుకు రావాలనుకుంటాడు. చెన్నయ్య 'పిల్లలు గలవాన్నని' చెప్పేసరికి సాయన్నకి 'కడుపుల చెయిబెట్టి కలిపినట్లయింది'. డబ్బిచ్చి గొర్రెలు తీసుకుంటాడు.

కులకచెర్లలో తులగోళ్ళ నరసమ్మతో సాయన్నకి పొత్తు కలిసింది. ఆమెని కలవడానికి వెళ్ళిన సాయన్నని ఈ ఊరి పటేలు వెంకటరెడ్డి చూస్తాడు. సాయన్నని చంపడానికి అతని చిన్నప్పటి దోస్తీ మాదిగ తుప్పలిని పురమాయిస్తాడు. ఎకరంనర భూమి రాసిస్తానంటే 'తుప్పలి' సాయన్నని చంపడానికి ఒప్పుకుంటాడు. కానీ సాయన్న చేతిలో తుప్పలి చనిపోతాడు. కంపదూకి పారిపోయే సాయన్నని వెంకటరెడ్డి తుపాకితో కాలుస్తాడు. గుండు 'పిక్క'లోంచి దూసుకుపోయింది. పటేలు మీద సాయన్న పగపట్టాడు. అతన్ని చంపడానికి బంగళాకెళ్లి నూతిలోపడిపోతాడు. ఊరంతా సాయన్నని పట్టడానికొస్తారు. అయినా తప్పించుకు పారిపోతాడు.

పండుగోల్ల సాయన్న ధర్మాత్ముడు. 'కలిగినోల్ల కొట్టిండు బీదోళ్లకు పెట్టిండు ` పేదపేద లోకులకు పెండ్లీలు జేసిండు. ఉన్నోల్లను కొట్టిండు సేనోల్లకు పెట్టిండు. పాపామేమీ చేయాలేదు పండూగోల్ల సాయన్న' జంగమయ్యపల్లె అడవుల్లో ఉండేవాడు. మందికి దానం చేసిన సాయన్నని పట్టడానికి హైదాబాదు జమీందారు, పాలమూరి అమీన్ కోటరుసాబు బయలేరతారు. చావుతప్పి కన్నులొట్టబోయి పారిపోతారు. పాలమూరు జైలు నుంచి ముగ్గురు అమీనులు ముప్పైమంది పోలీసులు వెళ్ళినా సాయన్నను పట్టలేకపోతారు.

కులకచెర్ల పటేలు వెంకటరెడ్డి తెలుగోల్ల నరసమ్మని మంచి చేసుకొని నల్లమందు సారాయి తాగించి నిషాలో పెట్టి సాయన్నని పట్టించాడు. ఇనుపచిక్కలేసి సాయన్నని 'తిరుమలదేవుని గుట్ట' కాడికి తీసుకుపోయారు. 'పాపమేమీ చేయాలేదు పండుగోల్ల సాయన్న, పండుగోల్ల సాయన్నని ఇడువుండ్రీ సరుకారు' అని నాలుగూళ్ళ మంది మొరపెట్టుకున్నారు. మూడు రోజులా కొట్టినా సాయన్న చావలేదు. పిక్కల్లో రెట్టల్లో తావీజు తెంపితేనే చస్తానని సాయన్నే చెప్పాడు. తలి గొండ్ల ఎంకన్న అలాగే చేస్తాడు. తెగిపడ్డ తలకాయ తల్లి సాయమ్మ ఒడిలోపడి "కిలకిలా నగబట్టింది' మంచినీళ్ళ బాయికాడ గుడికట్టమని తల్లికి చెప్పాడు సాయన్న.

మహబూబ్‌నగర్‌లోని తిరుమల దేవుని గుట్ట దగ్గర సాయన్న సమాధి ఉంది. పక్కనే అంజనేయుడి గుడి వుంది. ఆంజనేయుడితోపాటు సమానంగా సాయన్నకి ఇప్పటికీ పూజలు చేస్తారు. ఏటేటా సాయన్నకి 'కందూరులు' పెడతారు. బొడ్డెమ్మని ఆడేటప్పుడు ఇప్పటికీ సాయన్న పాట పాడుతారు. ఈ నాటికీ సాయన్న వారసులు మెరగోనిపల్లె దగ్గర చేలో సాయన్న దరగ్గా కట్టించి 'కందూరలు' పెడుతున్నారు"2 (జానపద చారిత్రక గేయగాథలు, (సం.) జయధీర్ తిరుమల్ రావు, పే. 2`3, 1994)

## కథాకథనంలో ఎత్తుగడ :

కథకైనా పాటకైనా ఎత్తుగడ చాలా ముఖ్యం. గేయగాథల్లో ఎత్తుగడ చాలా కీలకం. శ్రోతను కట్టిపడేసే ఎత్తుగడ లేకపోతే కథ విఫలమవుతుంది. అందుకే, కథను ఆరంభించటంలోనే నైపుణ్యం చూపాలి. అదే ఎత్తుగడ. సాయన్న కథలో నాయకున్ని పరిచయం చేస్తూ మొదలవుతుంది.

> **"పుట్టిందిగ మెరుగనిపల్లె పరిగిందిగ మెరుగనిపల్లె**
>
> **దేశంబులు చూస్తానని బయిలెల్లుడు సాయన్నో"**

అని గేయగాథ మొదలవుతుంది. ఈ రెండు వాక్యాల్లో ఎంతో అర్థముంది. ఒక పల్లెటూరిలో పుట్టిన సాయన్నకు ఇతర ప్రాంతాలు సంచరించాలని కోరిక. అలా ఇతర దేశాలు పర్యటించటం వల్ల సాయన్నకు లోకజ్ఞానం పెరుగుతుంది. సమాజం ఎలా వుందో తనకు తెలుస్తుంది. కాబట్టి దేశాలన్ని తిరిగి చూడాలనీ,

తద్వారా తనకో లక్ష్యం ఏర్పర్చుకోవాలని అతని అంతర్లీన ఆకాంక్ష. అలా బయలుదేరిన సాయన్న పరోపకారం కోసం తన జీవితాన్ని అర్పించాలని నిర్ణయించుకొనే దాకా వెళ్తుంది.

**పండుగ సాయన్న వ్యక్తిత్వ శిల్పనిర్మాణం :**

కథానాయకుడి వ్యక్తిత్వాన్ని శ్రోతలకు తెలియచేయాలి. అలా చేయటానికి వ్యక్తి దేహాన్ని వర్ణించాలి. గుణాన్ని వర్ణించాలి. ఆ వ్యక్తిని ఇతరులతో పోల్చి చూపించాలి. అప్పుడే కథానాయకుడి ప్రత్యేకత శ్రోతల హృదయాల్లో రూపుదాలుస్తుంది. సాయన్న వ్యక్తిత్వ శిల్పాన్ని ఇలా నిర్మిస్తాడు గాయకుడు.

**"పాలమూరి జిల్లాలో పద్నాలుగు తాలూకల్**
**వానిబట్టే మొనగాడిగ ఈ జిల్లాలో లేడవ్వో**
**పిడికెడు నడుముంటుది మూడు జానెల ఎద ఉంటది**
**మీసాలె పురిబెట్టి చెవులకు ఒడి చుట్టిండు"**

అతనికి ఆరుగురు స్నేహితులని చెప్పటం ద్వారా నాయకుడనే విషయం స్పష్టమవుతుంది. ఒక గ్రూపును నడపగల సమర్థత తెలుస్తుంది. గుగ్గిల్ల ముసలన్న, చాపలగూడెం ఎంకన్న, చిన్నగిరి, పెద్దగిరి, లంబాడి టోపన్న, రాంపురం రామన్నల పేర్లు చెప్పటం వల్ల కథకు వాస్తవికత ఏర్పడుతుంది. యధార్థ కథను తెలుపుతున్న విషయం శ్రోతలకు అర్థమవుతుంది.

**పండుగ సాయన్న సాహసకృత్యాలు :**

సాయన్న సాహసకార్యాలే తనకు కీర్తిని తెచ్చిపెట్టాయి. చారిత్రక గేయగాథగా అతని జీవితాన్ని పాడుకొనేలా చేసింది. అతని సాహసం కందూరు చేయటానికి సిద్ధపడుతాడు. ఉస్మానెల్లి కందూరలు చేస్తానని మొక్కుకున్నాడు. తన స్నేహితులతో కల్సి కందూరు చేయటానికి ప్రణాళిక వేస్తాడు. పాలమూరి ఇడిగొల్లయి సత్తూరి రామన్నయి పన్నెండు బియ్యం బండ్లు తాండూరుకు పోతున్నయి. దోస్తులను తీసుకొని వాటిని దోపిడీ చేయాలని పథకం. పోషమ్మ గుడికాడ కాపుకాసి దోపిడి చేయాలనుకుంటాడు. పన్నెండు మంది బోయోల్లు ఆ బండ్లుతోలుతున్నారు.

**"మీసం మెల్ల చుట్టారు రెట్టయిన మొనగాల్లు**
**అర్ధమ్మారాతీరి ఆమాసది మబ్బున్నది**
**అరుకాల బొబ్బల మీద బండ్లను తోలుకొస్తున్నరు**
**బండ్లాసప్పుడిన్నాడు కిలకిలమని నవ్వుతున్నాడు**
**అదురద్దోయీ దోస్తీలు! బెదరాకుండి దోస్తీలు**

**చెట్లామీద ఎక్కుండి మందిని మీరు చూడుండీ**

**మందిని మీరు చూడుండీ బండ్లను నేను చూస్తుంటను**
**ఆరుమంది దోస్తీలను టేకిచెట్లనెక్కిపిచ్చె**
**ఒంటీగాడు సాయన్న సడాకున నిలబాడె**
**పన్నెండు బండ్లన్నీ మీన బడివస్తున్నయి**
**తొలి బండికి కుడిభూజం ఇచ్చిండు నొగల కింద కూసుంటె**
**ముందలికి మూడడగులు జరుగవిగ బండ్లన్నీ"**

అలా పన్నెండు బండ్లను నిలువరించాడు. బండ్లమీద కూర్చున్న బోయోల్లు గిర్రలకు రాయో పోషమ్మో అడ్డుపడ్డదని అనుకుంటారు.

**'నిలువురాయి కాదప్ప మైసమ్మను కాదప్ప**
**నా కులమే తెలుగోడు నాపేరే సాయన్న**
**ఒక్కపని పడ్డందుకు బండ్లను నేను మల్లేసిన**
**బండికి నోలేడు బియ్యము నాకియ్యండి**
**మనిషీకి రెండేసి రూపాయలు మీకిస్తా**

ఇయ్యక నన్నపోయిరీ ఏమంటరు బోయొల్లు' (పే.5) అని సాయన్న బోయలను అడిగాడు.

వాళ్ళు మేము జీతగాళ్లం. బియ్యం తగ్గితే మా ఉద్యోగాలు పోతాయంటారు. అలాంటి పరిస్థితి వస్తే నాపేరు చెప్పండి. నేనే దోచినని చెప్పమన్నాడు. అలాగే డబ్బులు కూడా తీసుకొమ్మని చెప్పాడు. కానీ, మేము పన్నెండు మందిమి వున్నా. నువ్వొక్కడివే. అని సాయన్నమీద పడ్డారు.

"పన్నెండు మంది బోయొల్లు ఒక్కపారి దుంకిరి
ఎనుకకెల్లి ఆరుమంది ముంగటికెల్లి ఆరుమంది
బెల్లానికి సీమలు లెక్కపెట్టిండ్రు గద సాయన్నని
సాయన్నను పట్టేమొ గంటానర పొద్దాయె
ఊపితే వాడు ఊగడురో దొబ్బినగని జరుగాడురో
పాతేసిన రాయిలెక్క నిలబడ్డడు సాయన్న
మైసమ్మకు మొక్కిండు పండూగొల్ల సాయన్న
ఇగనుటకటలే జాడిచ్చే పండూగొల్ల సాయన్నే
ఈగెల్‌గరు దోమల్‌గరు పన్నెండుమంది బోయొల్లు
సడాకుల పడ్డారు పొర్లాడుతరు బోయొల్లు
పన్నెండుమంది బోయొల్లను మ్యాకల లెక్క తిప్పిండు

దొరికినోన్ని దొరికినట్టు బండ్డాకిగ గట్టిండు
బండీకి ఒక్క సంచి సడాకుల గుంజేసె
పన్నెండు సంచూలిగ ఒక్కాతన గుంజేసి
ఆరుమంది దోస్తీలను సీటిగొట్టి పిలిసిండు
ఆరుమందికి ఆరుసంచుల బియ్యాన్ని ఎత్తిండు
ఇంకారు సంచూలు ఒక్కనికే మిగిలుండయి
తన మెడకు ఇగ ఉండాది అరపై ముల్లకాశ దట్టి
కాశదట్టి పరిసిండు ఆరు సంచులు పట్టిండు
మైసమ్మకు మొక్కిండు ఈపుల మోపేసుకునె"

పన్నెండు మంది బోయొల్ల కట్టుతెంపి దోచింది పండుగొల్ల సాయన్న అని చెప్పమని పంపాడు. మొదటి దోపిడీని విజయవంతం చేశాడు. అయితే, బియ్యం దొరికాయి గానీ కూరలు కావాలి. ఈ విషయాన్ని గుర్తించి దోస్తులను భయపడొద్దంటాడు. యాటలు కాస్తున్న గొల్ల చెన్నప్ప దగ్గరికి వెళ్లిండు. ఎవడివిరా నువ్వు? మందమీదికొచ్చినవు? గొడ్డలితో నరుకుతా అని హెచ్చరించాడు చెన్నప్ప. నన్ను మించిన వీరుడవా అనుకున్నడు సాయన్న.

**''సేతులనె తామంచ భుజాననె తుపాకీ**
**బొడ్లోక్కనె జిమ్ముండది సంకాకే తల్వారా**
**మీసాలె పురిబెట్టి చెవులకు తను చుట్టిండూ**
**మందల్లతు కొట్టిండు నడిమందలకు దునికిండు**
**రొండు రెక్కలు పట్టిండు ఆ గొల్ల చెన్నప్పని**
**కాలు జేతులు కట్టిండు గొర్లల్లకు పారేసే**
**దొంగసాయిగాడంటవ ఓ గొల్ల చెన్నయ్య''**

అని ఆగ్రహించాడు. తెలియక ఆ మాటలన్న. పిల్లలు గన్నవాణ్ణి. అయిదు కాకపోతే పది యాటలు తీస్కో. నన్ను మాత్రం వదిలేయమని అంటాడు. పిల్లలగల వాడంటే పండుగొల్ల సాయన్నకు కడుపుల చెయిబెట్టి కలిపినట్లయ్యింది. కాల్లుచేతులిడిసి బొయొల్లకు ఇచ్చే డబ్బులు గొల్ల చెన్నప్పకిచ్చిండు. ఐదు యాటలను తీసుకొనిపోయి దోస్తులకిచ్చిండు. వాటిలో ఒకదాన్ని నోటితో పట్టుకున్నాడు కాబట్టి నాలిగింటినే కోసి కూరొండమన్నాడు. ఆ పని పురమాయించి, కులకచర్లలో వుండే తన ప్రియురాలింటికి (లంజింటికి) వెళ్లొస్తానని చెప్పాడు. ఆ వూళ్లో అందరూ నీమీద కోపంగా వున్నారు. వెళ్తే కొడుతారు. తిడ్తారని దోస్తులు వారించారు. కానీ సాయన్న వినలేదు. పాలమూరు జిల్లాలోనే నన్ను పట్టుకొనే మొనగాడు లేడనీ, అలాంటి

మాటలు మాట్లాడొద్దని గట్టిగా తిట్టి బయల్దేరాడు. అమాసరాత్రి. అర్ధరాత్రి. సాయన్న కులకచర్లకు చేరుకున్నాడు. ఆ వూరి పటేల్ వెంకట్‌రెడ్డి చెంబట్క కూర్చున్నాడు. అంత రాత్రి వేళ వస్తున్న సాయన్నను ఎవడవురా నువ్వని నిలువరించాడు. చీకట్లో ఎవరూ కన్పించటం లేదు. కోపంతో సాయన్న తుపాకీ తీసి ఎక్కువ మాట్లాడితే కాలుస్తాని హెచ్చరించాడు. వెంకట్‌రెడ్డికి గుండెలు రఅల్లుమన్నాయి. చెంబు కింద పడేసి వూళ్లెకురికాడు.

వూళ్లో జనాలను లేపుదామంటే సాయన్నను పట్టుకోవటం ఎవరివల్లా కాదని గుర్తొచ్చింది. మాదిగోల్ల తుప్పలి మాత్రమే సాయన్నను పట్టుకోగలడని అనుకున్నాడు. మాదిగవాడకొచ్చి తుప్పలి ఇంటిముందర నిలబడ్డాడు. ఆ చీకట్లో మాదిగ తుప్పలి వూళ్లోకి పెద్దపులి వచ్చింది. దాన్ని నువ్వు పట్టాలి. తుప్పలికి పుట్టెడొడ్ల మాన్యం, రెండు జోల్ల కమ్మెడ్లు, ఎకురన్నర భూమి రాసిస్తానని ఒప్పందం చేసుకున్నాడు. రెండుకాళ్ళపెద్ద పులిని పట్టకపోతే నీకు జీతముంటని మాటిచ్చాడు తుప్పలి. తన పేరుచెప్పి సారాతాగి సాయన్నను పట్టుకోను బొమ్మని చెప్పాడు.

తెలుగోల్ల నర్సమ్మ యింటికి సాయన్న వచ్చాడు. తనను పట్టే మొనగాడు లేడని పట్టెమంచం మీద పడుకున్నాడు.

**"అతారెలు తీసిండు లంజా చేతికిచ్చిండు**
**డోయేరు తుపాకి సిలుకొయ్యకు ఏసిండు**
**అమీసాలె పురిపెట్టి చెవులకు చుట్టి పండిరడు"**

తుప్పలి నర్సమ్మ తలుపు దగ్గరికొచ్చిండు. పడుకున్నడా, లేసుండా అని ఆలోచిస్తున్నడు. మెలకువతో వుంటే తనను గెలవనీడు. నెమ్మదిగా తలుపుతీసి సాయన్నను చూశాడు.

**"సాయన్నను చూస్తేరో గుండె జల్లుమన్నాది**
**పిడికీడే నడుమున్నది మూడుజానలె ఎద వున్నది**
**మీసాలె పురిబెట్టి చెవులకు సుట్టిపండిరడు**
**గుండెజల్లుమన్నది నిలబడ్డడు తుప్పాలి"**

అలా పడుకున్న సాయన్నను కత్తితో నరికితే తెగుతుందో లేదో అని సంశయం. కాళ్లుచేతులు గట్టిగా పట్టుకుంటే ఇడ్పించుకుంటాడు. వెనక్కి వెళ్తే చేతగానివాడంటారు. పుట్టింది చచ్చేదీ ఒక్కనాడే అనుకున్నడు. సాయన్నమీద పడి గట్టిగా పట్టుకున్నడు. తొలి కోడిసప్పుడు విని సాయన్న లంజమీద బుద్ధిపుట్టింది. ఒళ్లు విరుచుకున్నడు. కానీ ఒళ్లు కదలట్లేదు.

**"జడ్డీకాప్రామనం సందివ్వడు తుప్పాలి**

తుప్పలిగాని పట్టుకొని పన్నెండుమని జడ్డితీస్తే
గప్పుడు ఏమంటని అనకుంటడు సాయన్న
సాయమబ్బు చేసిందని అనుకుంటడు సాయన్న
తుప్పలిగాని దప్పీగని తన్నిండుర సాయన్న
తుప్పలికి తప్పింది లంజింటికి తగిలింది
కొనలంజె నర్సమ్మది పోయి గోడన దూరింది
గప్పూడిగ సాయన్న మేలుకయి చూసిండు
ఎవ్వడ్రా పట్టింది నీ తక్కిన దెంగానె"

ఎవడ్రా నన్ను పట్టుకున్నదని గట్టిగా అడిగాడు. నీకు నాకు పగలేదు. నేను మాదిగోల్ల తుప్పలిని. వెంకట్‌రెడ్డి పట్టమంటే పట్టుకున్న అని చెప్పాడు.

"ఏమప్పా తుప్పాలి ఓ మాదిగ తుప్పాలి
కూలినాలి చేయటానికి ఒకరింటికి పోతాము
.... .... .....
గాండ్లోల్ల గాసంబు నువ్వుంటివి తుప్పలిగా
కోమటోల్ల గాసంబు నేనుంటీ తుప్పలన్న
అడివడివీ తిరిగీ నువు ఆకలిగొని వస్తేరా
నాకు తెచ్చిన సద్దీ నీకు తినపెడితి తుప్పలిగా
పొత్తుల తిని పోట్లాడకు వద్దప్పా నన్నిడువు"

అని ఎంత వేడుకున్నా తుప్పలి వదల్లేదు. నా ప్రాణంపోయినా నిన్ను వదలనన్నాడు. అటూఇటూ పొర్లాడి బొడ్లోవున్న కత్తినోటితో తీసుకొని చేతుల పట్టుకున్నడు. గొంతులో కత్తిదించి బొడ్డుకిందికి చీరాడు సాయన్న. నెత్తుటిమడుగులో పడికొట్టుకుంటున్న స్నేహితున్ని చూసి కంటతడిపెట్టిండు సాయన్న. తన ప్రాణాలు కాపాడుకోవడానికి చంపాల్సివచ్చిందని బాధపడ్డడు. ఇంతటి దుర్మార్గానికి వెంకట్‌రెడ్డి పటేల్ కారణమని ఆగ్రహించాడు. అతన్ని చంపాలని బయల్దేరాడు. ఏడంతుస్తుల మేడమీద తుపాకీపట్టుకొని కూర్చున్నడు పటేలు. సాయన్నను చూడగానే అర్థమైంది. తుప్పలిని చంపి నన్నే చంపడానికి వస్తున్నాడని అర్థమైంది. తుపాకీ చేతపట్టుకున్నాడు. టార్చ్‌లైటు వెలుతురును సాయన్నమీదికి వేసిండు. కాలుస్తూనే మేడమీదికి చేరుకున్నడు. పటేలును వెంటాడుతూ సాయన్న మేడ ఎక్కేక్రమంలో పక్కనే వున్న బాయిలో కాలుజారి పడిపోయాడు. దీంతో పటేలు వూరందరినీ పిలిచాడు. సాయన్న దొరికాడనీ, బాయిలోనే తలమీద రాల్లేసి చంపేయాలని ప్రయత్నించారు. బాయిచుట్టూ జనాలు మూగివున్నారు. పోషమ్మను, మైసమ్మను తల్చుకొని నెమ్మదిగా దరిపట్టుకొని పైకి ఎక్కడం మొదలుపెట్టాడు. సాయన్న వూళ్లోకొస్తే కొట్టిచంపాలని

సందుకుపదిమంది కాపలా కాస్తున్నారు. చీకట్లో ఇదిగో సాయన్న, అదిగో సాయన్న అంటూ జనం ఒకరినొకరు కొట్టుకొని పన్నెండు మందికిపైగా చనిపోయారు. సాయన్న నిజంగానే కన్పించగానే పరిగెత్తడం మొదలుపెట్టారు. వచ్చిన పని కాలేదురా ఎంకట్ రెడ్డి ఎనిమిది రోజులు నువ్వు కమ్మగా తిను. నేను వారం రోజులకు మల్లొస్త అని చెప్పి దోస్తుల కాడికి పోయాడు.

పండుగ సాయన్న ప్రతాపం అర్థమైన పటేలు పాలమూరు పోలీసులకు మొరపెట్టుకున్నాడు. ఒకనాడు మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో పాడావుల బండకెల్లి పోతున్నడు సాయన్న.

**ఖదాబా జందారు పాలమూరు కోటరుసాబు**
**సాయన్నను పట్టనీకె దొరవాల్లు ఎల్లింద్రు**
**పాడావుల బండకాడికి ఇగ అడ్డం వచ్చింద్రు**
**ఖైదాబాద జందారు ఇగ ఏమంటని బెదిరిచ్చె**
**ఎక్కడా పోయినావుర దొంగ నువ్వు సాయన్న**
**నీ కొరకు సాయన్న మూడురోజుల పొద్దాయె**
**నడువప్పా సాయన్నా పాలమూరి జేలుకు**
**కోపం మీన ఉన్నాడు పండూగొల్ల సాయన్న**
**దొంగ సాయిగాడంటవ మాకేల్లైడె మల్లీగా**
**దిగదిగనే ఉరికిండు జందార్ మీదికురికుండు**
**అల్లాఖుద్ అనానడు అడ్డామె పడిపోయె**
**జందారుని గుద్దించి కోటరుసాబు చూసెనా**
**సామాన్యుడు కాదప్పో పండుగొల్ల సాయన్న**
**నల్లాబుధ గుర్రాము దుమ్ముల కనిపియ్యదు**
**మెడిమెల్లు జాడిచ్చెర పండూగొల్ల సాయన్నది**
**నల్లాబుధ గుర్రాము మెడిమెలే జాడిస్తే**

**… … … …**
**అయ్యయ్యో కోటరుసాబు పాలమూరు అమీను**
**నాకు మించి నువ్వెల్లి పోతావా అమీనని**
**గుర్రమెనక తగలిండు పండూగొల్ల సాయన్న**

**… … … …**
**ఆమెన్నర సందుల గుర్రానిగ నిలబెట్టే**

అమీను గుర్రాన్ని ఆపాడు. భయపడిపోయిన అమీను నిన్ను కొట్టడానికో తిట్టడానికో రాలేదని బతిమాలుకున్నాడు. కుందేల్ల షికారుకొచ్చిన అని వేడుకున్నడు. కోపంతో సాయన్న అమీను కూర్చున్న గుర్రం తోకను మొదలంటా నరికేశాడు. జందారును కడుపులో ఒక్క గుద్దు గుద్దిండు. కళ్లు బైర్లు కమ్మి సొమ్మసిల్లాడు. కళ్లు తెర్చి చూస్తే గుర్రం దుమ్ములేపుకుంటా ఉరుకుతుంది. పాలమూరు జైలుముందుకెళ్లి ఆగింది. అమీను భయంతో వణికిపోతున్నాడు. సాయన్న దేశం దక్కనీయడు. ఈ దేశాన్ని సాయన్న ఆక్రమిస్తాడని చెప్పాడు. దీంతో ముప్పయి మంది పోలీసులకు కోపమొచ్చింది. తుపాకులు తీసుకొని సాయన్న కోసం బయల్దేరారు.

**"పోసావుల దరికాడ పాడావుల బండుండది**
**పాడావుల బండమీద పండుంటడు సాయన్నో**
**బండామీద పండిరడు సుట్టుముట్టు పోదాము**
**బారుచేసి కూసున్నరు తుపాకులు సల్లగుండ**
**బండసుట్టు కమ్మిండ్రు 30మంది పోలీసులు**
**మీదికే లేసిండు కూసున్నడు సాయన్నో**
**సాయన్నను చూస్తే సల్లగనే అయిపాయె**
**30మంది పోలీసుల దగ్గరికే పిలిసిండు**
**తుపాకుల్ గుంజిండు మోపులు తను కట్టిండు"**

తుపాకులను కట్టగట్టి ముడ్డికింద పెట్టుకొని కూర్చున్నడు. 30మంది పోలీసులతో బొడ్డెమ్మ ఆడిచ్చాడు. నిన్నుపట్టుకొనేందుకు రాలేదు. దయచేసి మమ్మల్నొదిలెయమని వేడుకున్నారు. తుపాకులివ్వక పోతే మా ఉద్యోగం పోతదని మొరపెట్టుకున్నడు. పెల్లాం పిల్లలున్నవాళ్లమని బతిమాలుకున్నారు. ఆ మాటతో తన కడుపులో చెయ్యిబెట్టి దేవినట్టయింది. కరుణించాడు. జాలిపడి వదిలేసాడు. ఆ తుపాకులు తీసుకొని వెనక్కి మళ్లారు పోలీసులు. పాలమూరుకు చేరకున్న పోలీసులు సాయన్నను పట్టుకోవటం సాధ్యంకాదని పై అధికారులతో మొరపెట్టుకున్నారు. పండుగొల్ల సాయన్న వీరత్వం ఎంత పెద్దయెత్తున వర్ణిస్తాడో అంతేస్థాయిలో ఆయనలో వున్న మానవత్వాన్ని, దయాగుణాన్ని చాలా చిన్నమాటల్లో వర్ణిస్తాడు.

### పండుగ సాయన్న హత్యకుట్ర :

వెంకట్‌రెడ్డి పటేలు పాలమూరుకు వచ్చిండు. ఎలాగైనా సాయన్నను పట్టుకోవాలని కోటరుసాబును కలిసి అభ్యర్థించాడు. పోలీసులకు ఆ పని సాధ్యం కాదని కోటరుసాబు చెప్పిండు. ఇద్దరు కలిసి ఒక పథకం వేశారు. ఇద్దరూ కల్సి కులుకచర్లలోని నరసమ్మను కలిసారు. తెలుగు కులస్తురాలామె. ఆమెతో ఇలా మాట్లాడుతున్నారు.

**"అయ్యాయ్యో నరుసమ్మో ఓ తెలుగు నరసమ్మో**
**వెయ్యిల కొద్ది రూపాయలు నీకిస్తము నరుసమ్మో"**

అని అడిగారు. నరుసమ్మ బెదిరిపోయింది. సాయన్న ఇచ్చిన బట్టకట్టుకున్న. పెట్టిన తిండితిన్న. అలాంటి మంచిమనిషిని ఎట్లా పట్టివ్వాలి అని అంది. నువ్వు పట్టివ్వకపోతే బట్టలిడిపించి కొడ్తాం అని పాలమూరు పటేల్, కోటరుసాబులిద్దరూ ఆమెను బెదిరించారు. వాళ్ళను ఎదిరించి నిలబడగలిగే శక్తి ఆమెకు లేదు. తనకు ఎవరి మద్దతు లేదు. ఎంతో బలవంతులైన మీకే సాయన్నను పట్టుకోవటం సాధ్యంకాలేదు. ఆడదాన్ని నాకెలా సాధ్యమని ప్రశ్నించింది. అందుకు ఒక ఉపాయం చెప్తామన్నారు.

**"అర్ధశేరు నల్లమందు శేరున్నర సరాయి**
**కలిపిమేమిస్తాము నిషబాది చెయ్యమ్మా**
**నిషబాదిని చెయ్యమ్మో మేమైతనే పడుతాము**
**రూపాలకు ఆశపడి దెబ్బలకు భయపడి**
**పడుతానని చెప్పింది పట్టిస్తానని చెప్పింది"**

ఆ ఒప్పందం కుదిరింది. అరవైమంది పోలీసులు పాతింట్లో దాక్కున్నరు. ముగ్గురు అమీన్లు కొత్త యింట్లో వున్నరు. అర్ధశేర నల్లమందు సేరున్నర సారాయి రెండు సీసలు కలిపి నర్సమ్మకు ఇచ్చారు.

పండుగొల్ల సాయన్న అడవులు తిరుగుతూ ఆకలిగొన్నడు. అలిసిపోయాడు. నర్సమ్మ ఇంటికి రాగానే పట్టెమంచం వేసింది. అప్పటికే చీకటిపడి చాలాసేపయింది. ఇంతరాత్రి వస్తివి సాయన్న అని అడిగితే పిల్లి అడ్డమొచ్చిందని చెప్పాడు. నాకు దూపవుతుంది. తాగడానికి ఏమైనా ఇమ్మని అడిగాడు. ఇప్పపువ్వు సారాయి వుంది. ఇవ్వనా అని అడిగింది. రెండుసీసలు చేతికిచ్చింది. ఒకసీస సారాయి నిలబడి తాగాడు. మరోసీసా మంచంమీద కూర్చొని తాగాడు. అర్ధశేరు నల్లమందు ఒకేసారి తాగాడు. సేరున్నర సారాయి తాగి కూర్చున్నడు. నెమ్మదిగా నర్సమా ఇంట్లోంచి బయటికొచ్చింది. తలుపు గడిపెట్టింది.

**"గిప్పుడూ పట్టుండి పండుగొల్ల సాయన్నని**
**నిషాబాది అయ్యిండు ఇప్పుడు దొరుకుతడు**
**అరువైమంది పోలీసులు ముగ్గురు అమీనులు**
**తలపూ కాడికొచ్చిండ్రు నిక్కీనక్కి చూస్తున్నరు**
**తొంగితొంగి చూస్తున్నరు పండూగొల్ల సాయన్నను**
**ఇల్లెలుపున పోరాడుతడు పండుగొల్ల సాయన్న**
**తిప్పితిప్పి కొడుతడు పండూగొల్ల సాయన్న"**

కానీ బాగా తాగివుండటం వల్ల కాళ్లుచేతులు కదిలేస్థితిలో లేవు. నల్లమందు నిషాలో తిప్పికొడుతుంది. నెమ్మదిగా నరుసమ్మ తలుపుతీసింది. అరువైమంది పోలీసులు లోపలికొచ్చారు. సాయన్న కాళ్లుచేతులు ఆడిస్తేనే వాళ్లు అంతదూరం ఎగిరిపడుతున్నరు.

**"తలపుకే కమ్మిండ్రు ఇనుపాసిక్కము దెచ్చి**
**ఇనుపా చిక్కామేసి పట్టిండ్రుగద సాయన్నని**
**సాయన్నని పట్టిండ్రు బయటికీ గుంజిండ్రు**
**ఇనుపా సిక్కమేసి దగ్గరికి గుంజిండ్రు**
**ఎంకట్‌రెడ్డి పాటేలు మోటరిగ తెప్పిచ్చే**
**కులకచెర్ల ఊల్లెకు లారీ తెప్పిచ్చే**
**మోటర్‌మీద ఎక్కిచ్చిరి పండుగొల్ల సాయన్నని"**

కులకచెర్ల వూరినించి పాలమూరుకు తీసుకెళ్లారు. తిరుమల దేవుని గుట్టదగ్గర లారీనుంచి దింపారు. సాయన్నను పట్టుకున్న సంగతి తెలిసి నాలుగూళ్లమంది చూడ్డానికి వచ్చారు. దేశమంతటి నుంచీ వస్తున్నారు. పెద్దపెద్ద వ్యాపారులు ఏమి జరిగిందని అడుగుతున్నారు. పాపమేమీ చేయలేదు పండుగొల్ల సాయన్న. వేలకొద్ది రూపాయలిస్తం సర్కారు. సాయన్నను విడిచిపెట్టమని ప్రజలు బతిమాలుకున్నారు. కలిగినోల్ల కొట్టి పేదోల్లకు పెట్టిండని వేడుకున్నారు. కానీ పాలమూరు జైలరు ఒప్పుకోలేదు. సాయన్న బతికుంటే రాజ్యం ఆక్రమిస్తాడన్నాడు. దేశానికి రాజవుతాడన్నాడు.

## పండుగ సాయన్న హత్య:

పన్నెండు బజార్లు తిప్పారు సాయన్నను. అతన్ని చంపడానికి ఎవరికీ ధైర్యం చాలటం లేదు. బండమీది పల్లెలోని తలగొడ్ల ఎంకన్న అయితేనే సాయన్న తలపగలగొట్టి చంపుతాడని అనుకున్నారు.

**"అయ్యయ్యో ఎంకన్నా తలగొడ్లని ఎంకన్నా**
**పండుగొల్ల సాయన్నా తలకాయని కొట్టురా**
**గండ్రగొడ్డలి ఇచ్చిండ్రు తలగొడ్లని ఎంకన్నకు**
**పూలదాలేసిండ్రు తలగొడ్లని ఎంకన్నకు**
**బయటికి తీస్తేరా దక్కనీయడు తెలుగోడు**
**ఇనుపా సిక్కింకెల్లి పండుగొల్ల సాయన్న**
**జుంపాలు పట్టిండు మెడకాయనె గుంజిండ్రు**
**కాడిమ్యాస్ తెచ్చిండ్రు మెడకింద పెట్టిండ్రు"**

ఆ రకంగా సాయన్నను చంపడానికి ఏర్పాట్లు చేశారు. సాయన్నను రక్షించడానికి వనపర్తి రాజాగారు, శంకరమ్మ అమ్మగారు ప్రభుత్వం నుంచి ఉత్తరం తీసుకొని అక్కడికి వచ్చింది. కానీ పోలీసులు తప్పుడు సమాచారం ఇచ్చారు. మూడు రోజుల కిందటే తలగొట్టి చంపామని తెలిపారు. వనపర్తి సంస్థానం రాణి శంకరమ్మ ఆ వార్తవిని నిస్సహాయురాలైంది. తిరిగి వెళ్లిపోయింది. ఆమె అక్కణ్ణించి వెళ్లిపోయిన అర్ధగంట తర్వాత సాయన్నను బయటికి తీశారు. గొడ్డలి చేతికిచ్చి తలగొడ్ల ఎంకన్నను ఉసిగొలిపారు.

**"దగ్గరికి వచ్చిండు తలగొడ్ల ఎంకన్న**
**ఏటిమీద ఏటప్పా మూడేట్లుగ నరికిండు**
**ఎంటికే ప్రామాణం సందివ్వదు తలికాయ**
**ఆడికీ సాయన్నను మూడురోజులు కొట్టిండ్రు**
**మూడ్రోజులు కొట్టిండు తలగొడ్లని ఎంకన్న**
**అయ్యయ్యో ఆమీను పాలమూరి అమీను**
**నానుంచి కాదప్ప పాలమూరి అమీను"**

తలగొడ్ల ఎంకన్న తన వల్ల కాదని చేతులెత్తేశాడు. సాయన్న తలకు చిన్న గాటుకూడా కాలేదు. మూడురోజులు నరికినా అతనికి ఏమీ కాలేదు. సాయన్నకు తాగిన మైకం దిగింది. తనను ఎలా చంపాలో తానే ఆ మర్మం చెప్పటం ఆసక్తికల్గిస్తుంది.

**"నిషబాది తేల్చింది పండుగొల్ల సాయన్నను**
**అయ్యయ్యో ఎంకన్నా తలగొడ్ల ఎంకన్నా**
**నా పిక్కలు చీరురా నా రెట్టలు చీరురా**
**గప్పుడైతే పోతాది నా ప్రాణం ఎంకన్న"**

అని సలహా ఇచ్చాడు. వెంటనే తలగొడ్ల ఎంకన్న బంగారు పిడి వున్న కత్తితో చేతులు పిక్కలు చీరాడు. 32తాపీజులు (తావీదులు) ఈగల్లాగ లేచిపోయాయి. అప్పుడు సాయన్న ఇలా అన్నాడు.

**"గప్పూడు ఏమంటడు పండూగొల్ల సాయన్న**
**గిప్పుడైతే కొట్టిచూడుర తలగొడ్లని ఎంకన్న"**

అన్నాడు. ఇప్పుడు నరికిచూడు. తలతెగిపడుతుందని చెప్పాడు. వెంటనే తలగొడ్ల ఎంకన్న సాయన్న తలను పట్టిలాగాడు.

**"కాడిమ్యాస్‌కి గుంజిండు పండూగొల్ల సాయన్నని**
**ఏటిమీద ఏటప్పా ఒక్కేటుగ కొట్టేరా**

**ఒక్కాటే ఏటు మల్లాపులం అన్నాము**
**మల్లాపులం అన్నాము ఏకుదమ్మున ఎగిరింది**
**కన్నతల్లి సాయమ్మా ఏమంటాది సాయన్నా**
**కొంగూను చాపుకొని గోడుగోడు మంటాది**
**తలకాయనే పోయింది కొంగూల్లనే పడ్డాది**
**తలకాయనే పోయింది ఒల్లెలా పడ్డాది.**
**ఒల్లెలాపడ్డాది కిలకిలా నగబట్టే''**
ఒక్కవేటుకు తలతెగి మల్లాపులంలో వున్న సాయన్న తల్లి కొంగుఒడిలో పడిరది.

## పండుగ సాయన్న గుడి నిర్మాణం:

తల్లి సాయమ్మ ఒడిలో తెగిపడిన తల కిలకిలా నవ్వింది. ఆ తర్వాత తల్లితో ఇలా అంటుంది.

**''అయ్యయ్యో సాయమ్మ కన్నతల్లి సాయమ్మ**
**పెద్దలు చెప్పినమాట పెరుగన్నము సద్దాయే**
**నీమాట ఇనపోతి తండ్రీ మాటినపోతి**
**అదురద్దు సాయమ్మా బెదురద్దు కన్నతల్లి**
**పాలమూరి జిల్లాలో పద్నాలుగు తాలూకల్**
**పద్నాలుగు తాలూకల నేను గత్తర లేపూత**
**ఎంత దూరము తిరిగినా కన్నతల్లి సాయమ్మ**
**ఇగ గత్తర లేపూతానే ఏకుదమ్ముల చెప్పిండు**
**అదురద్దు సాయమ్మ బెదరద్దు కన్నతల్లి**
**మంచినీల్లబాయి మీద నాగూడి కట్టమ్మా**
**నాగూడి కట్టమ్మా కన్నాతల్లి సాయమ్మ''**

అని తల్లితో చెప్పాడు. పాలమూరు జిల్లాలో మంచినీల్ల బాయి దగ్గర తనకు గుడికట్టమని చెప్పాడు. తనను చంపినవాళ్లను గత్తరలేపి చంపుతానని చెప్పాడు. సాయన్న చెప్పినట్టే మూడోనాడు తలగోడ్ల ఎంకన్న చనిపోయాడు.

**''తలగొడ్లని ఎంకన్న మూడు రోజులకు పోయిండు**
**ఎంతమంది కొట్టింద్రో అంతమందికి గత్తార**
**ఎంతమందికి గత్తార ఇగ లేపెర సాయన్నా''**

అలా గత్తరలేపి తనను చంపిన వాళ్లను, కొట్టినవాళ్లను భూమిమీద లేకుండ చేస్తున్నాడు. ఈ చావులను ఎలా ఆపాలో తెలియని ప్రభుత్వం సాయన్నకు మొక్కుకుంది.

**"గప్పుడు కద ఏమంటరు గౌరుమెంటు సరుకారు**
**అన్నన్నర, సాయన్న ఓ పండుగ సాయన్న**
**పదియాటల పాలబియ్యం ఏటేటా కందూర**
**యాటాట కందూర నీకు చేత్తము సాయన్నా**
**మాకైతే నిషాను చూపద్దుర సాయన్న"**

అని వేడుకున్నారు. కన్నతల్లి సాయమ్మ తలకాయను తీసకెళ్లి గుడికట్టింది. అప్పటినుంచి సాయన్న దేవుడయ్యాడు. ప్రతియేటా ఇప్పటికీ అక్కడ పూజలు జరుగుతూనే వున్నాయి.

## పండుగ సాయన్న హత్యతీరులో నమ్మకాలు:

సాయన్న హత్య జరిగిన తీరు హేతుబద్ధంగా కన్పించదు. సాయన్న రెక్కలు, కాలిపిక్కల్లో తాయత్తులున్నాయనీ, వాటివల్లే గొడ్డలితో నరికినా తలతెగలేదని జానపదుల విశ్వాసం. ఇలాంటి విశ్వాసాలు ప్రజల్లో నేటికీ అక్కడక్కడ కన్పిస్తాయి. సాయన్న వీరత్వం అసాధారణమైంది. వజ్రకాయుడైన సాయన్నను అంత తేలిగ్గా ఎవరూ అంతమొందించలేరు. అయితే, సాయన్నను పాలమూరు జైలరు, పటేలు ఇద్దరు కల్సి చంపింది నిజం. ఈ నిజాన్ని జానపదులు జీర్ణించుకోలేకపోయారు. ఈ వాస్తవం ఎలా సాధ్యమైందో ఊహించలేకపోయారు. అందుకే, పండుగొల్ల సాయన్నకు మహిమలను ఆపాదించారు. పేదలకు సహాయం చేసిన సాయన్నను దేవుణ్ని చేశారు. తనను చంపినవాళ్లను గత్తరలేపి చంపాడని జానపదుల నమ్మకం. ఇది ఆధునికత ప్రవేశించిన కాలంలో జరిగిన కథ. ఆధునికత ఒకవైపు, ఫ్యూడలిజం మరోవైపు సంఘర్షించిన తీరు ఈ కథలో కన్పిస్తది. అయితే, సాయన్న ఫ్యూడల్ వ్యవస్థ అంతమదశలో ప్రజలకోసం నిలబడిన జానపద వీరుడు. అందుకే, ఫ్యూడల్ వ్యవస్థలో కన్పించే కొన్ని లక్షణాలను వీరుడి శక్తిసామర్థ్యాలుగా భావించటం కన్పిస్తుంది. సాయన్నకు ఒక ప్రియురాలుంది. ఆమెను ప్రియురాలని కథచెప్పదు. ఆమెనొక లంజగా చెప్తుంది. ఆమె దగ్గరికి వెళ్లిన సాయన్న పట్ల ఆరాధన. అతన్ని పట్టించిన తెనుగొల్ల నరుసమ్మపట్ల హేయభావం చిత్రించటం కన్పిస్తుంది. అదేవిధంగా, సాయన్న కల్లు, సారాయి తాగేవాడనీ, ఒక్కదమ్మున సీస సారాయి తాగాడని చెప్పడం కన్పిస్తుంది. జానపద వీరుడు కల్లు, సారాయి తాగడం, ప్రియురాలును ఉంచుకోవటం వంటివి చేయటం సాధారణం. అలాంటి లక్షణాలతోపాటు దయార్థ్రహృదయం కల్గివుండటం అతిముఖ్యమైన లక్షణం. ఈ లక్షణాలన్నీ పండుగొల్ల సాయన్నలో కన్పిస్తాయి. అయినప్పటికీ, సమాజం ఫ్యూడల్ దశనుంచి ఆధునిక దశలోకి ప్రవేశిస్తున్న కాలంలో జరిగిన

కథ. ఎంతో విలక్షణమైన ఈ చారిత్రక వీరగాథ నేటికీ పాలమూరు జిల్లాలో ప్రజలమధ్య సజీవంగా వుంది. కిన్నెరమెట్ల కళాకారులు ఈ గేయగాథను చాలాగొప్పగా ప్రదర్శిస్తున్నారు.